నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 12 నుండి ఒంటి గంట వరకు జోడిమెట్ల ఫీడర్ పరిధిలోని అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, జోడిమెట్ల క్రాస్ రోడ్, అరుంధతి కాలనీ, హుడా కార్తికేయ, కాకతీయనగర్, స్వర్ణగిరి కాలనీ, వైష్ణవి కాలనీ, చౌదరిగూడ, నారపల్లి ఫీటర్ పరిధిలోని సప్తగిరికాలనీ, రేవతి రైస్ మిల్, వీకర్ సెక్షన్ కాలనీ, అంజని స్కూల్, విజయపురికాలనీ, ఏసియన్ మాల్, రోటర్‌డ్యామ్ స్కూల్, డాక్టర్స్ కాలనీ, నారపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని వెంకటాద్రి టౌన్‌షిప్, చౌదరిగూడ, విజయపురికాలనీ, శివాజీనగర్, ఓయూ కాలనీ, అన్నోజిగూడ ఫీడర్ పరిధిలోని వెంకటాద్రి టౌనిషిప్ ఫేస్ -1, 2, 3, చౌదరిగూడ, విజయపురికాలనీ, శివాజీనగర్, ఓయూ కాలనీ, రోజ్ ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, ఏకశిలానగర్, సుప్రభాత్ టౌన్‌షిప్, వీకర్ సెక్షన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా


ట్రయిల్‌రన్‌లో పాల్గొన్న జలమండలి సిబ్బంది

కీసర: నాగారం మున్సిపాలిటీ 8వ వార్డులోని ఎస్వీనగర్‌లో నిర్మించిన 7.5 లక్షల లీటర్ల కెపాసిటీగల ఓహెచ్ఎస్ఆర్ (ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయిర్) నుంచి మంచినీటి సరఫరా శనివారం నుంచి చేయనున్నట్లు జలమండలి -21 డివిజన్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, నాగారం సెక్షన్ డిజిఎం బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్వీనగర్‌లో ఈ మేరకు ట్రైల్‌రన్ నిర్వహించారు. 7,8,9, వార్డుల్లో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ట్రైల్‌రన్ నిర్వహించినట్లు తెలిపారు.

నేడు తార్నాకలో 'మూలం సంత'

లాలాపేట: గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో 9వ 'మూలం సంత' నిర్వహిస్తున్నట్లు మూలం సంత కోఆర్డినేటర్ మల్లేషం బొమ్మకంటి శుక్రవారం తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ మూలం సంత కొనసాగుతుందన్నారు. రైతులు, చేతి వృత్తుల వారు వ్యవసాయ విలువ జోడింపు, చిరుధాన్యాలు, చిరు ఉత్పత్తులు, ఖాది,ప్రకృతి ప్రేమికులు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించడానికి ఇది ఓ ప్రత్యేక వేదిక అని పేర్కొన్నారు.

గురుకుల్‌ను అభివృద్ధి చేయాలి



ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని కోరుతూ గురుకుల్ పూర్వ విద్యార్థులు ప్రజా ప్రతినిధులకు లేఖలు పంపే కార్యక్రమం చేపట్టారు. మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కు శుక్రవారం వినతి పత్రాలు పంపారు. అనిల్‌కుమార్ స్పీడ్ పోస్ట్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉత్తరాలు పంపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు వెంకటేశ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

లారీ కింద పడి మహిళకు తీవ్ర గాయాలు

కీసర: ప్రమాదవశాత్తు ఓ మహిళ ట్యాంకరు లారీ క్రింద పడి తీవ్ర గాయాలకు గురైన సంఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రాంపల్లి దాయరకు చెందిన కందాడి ధనలక్ష్మీ కుటుంబంతో కలిసి ఏఎస్‌రావునగర్‌లో ఉంటున్నారు. శుక్రవారం తమ సొంతూరు రాంపల్లిదాయరకు వచ్చి ద్విచక్ర వాహనంపై కుమారుడితో కలిసి ఈసీఐఎల్ వైపు వెలుతున్నారు. రాంపల్లి చౌరస్తాలో సిగ్నల్ వద్ద ద్విచక్ర వాహనం వెనకాల కూర్చున్న ఆమె ప్రమాదవశాత్తు ట్యాంకరు లారీ కిందపడింది. లారీ డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేశాడు. ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర పురస్కారాలు


పురస్కారాలు పొందిన ఉద్యోగులతో అధికారులు

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో గత డిసెంబర్ నెలలో తమ విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు యాజమాన్యం ప్రగతి చక్ర పురస్కారాల అందజేసింది. డ్రైవర్లు, శ్రామిక్‌లు, కండక్టర్ల ఎంపిక చేసి ప్రగతి చక్ర పురస్కారాలు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్ అసిస్టెంట్ డీఎం రామారావు,ఏఈ స్నేహలత, సూపరింటెండెంట్ పీఎస్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

నల్లా బిల్లు.. గుండె గుబిల్లు

- మేడ్చల్ మున్సిపల్ అధికారుల స్పెషల్ డ్రైవ్
- ఐదారేళ్లుగా బిల్లులు పెండింగ్
- నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

మేడ్చల్: మున్సిపాలిటీల పాలకవర్గం పదవీ కాలం ముగియడం.. స్థానిక సంస్థలకు ప్రత్యేకాధికారుల పాలన రావడంతో అధికారులు మొండి బకాయిలు వసూలు చేసే పనిలో పడ్డారు. మేడ్చల్ మున్సిపాలిటీలో ఐదారేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లులు వసూలు చేయడానికి అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

- బీఆర్ఎస్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన తరువాత మేడ్చల్ పట్టణంలో రూ. 40 కోట్లు ఖర్చు చేసి ఇంటింటికీ మిషన్ భగీరథ పథకంలో భాగంగా గోదావరి నీరు ఉచితంగా సరఫరా చేశారు. దాదాపు ఏడేళ్ల నుంచి మేడ్చల్ పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా నల్లాల ద్వారా గోదావరి నీరు తాగుతున్నారు. ఇలా ఏడేళ్లలో రూ. 5కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి.
- అయితే మున్సిపాలిటీ పరిధిలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లులు వసూలు చేయడానికి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి నెంబర్ ఆధారంగా నల్లా కనెక్షన్ బకాయిల వివరాలు తీస్తూ వెంటనే చెల్లించాలని లేదంటే నల్లా కనెక్షన్ తొలగిస్తామని చెబుతున్నారు. ఇలా ప్రతీ వార్డులో వాటర్ మ్యాన్‌కు తోడుగా బిల్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయంలో పని చేసే సిబ్బంది ఉదయాన్నే ఇళ్లకు చేరుకుని నల్లా కనెక్షన్‌ల బకాయిల వసూలుకు తిరుగుతున్నారు.

ఏ ప్రాతిపదికన వసూలు చేస్తున్నారో...

గత ప్రభుత్వం రూపాయికి నల్లా నీటిని సరఫరా చేసింది. అయితే కమర్షియల్ కనెక్షన్లకు డబ్బులు వసూలు చేశారు. దీంతో మేడ్చల్ మున్సిపాలిటి పరిధిలో నల్లాలకు ఎక్కడా మీటర్లు అమర్చలేదు. అధికారులు ఇళ్లకు వచ్చి సగటున రూ.8 నుండి 10 వేలవరకు బిల్లు పెండింగ్‌లో ఉందని చెల్లించాలని చెబుతున్నారు.

ఇప్పుడే ఎందుకు..

ఇనాళ్లు లేని నల్లా బిల్లుల వసూలు ఇప్పుడే ఎందుకని ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. ఏనాడూ నల్లా బిల్లులు అడగని మున్సిపల్ అధికారులు అకస్మాత్తుగా ఎందుకు వసూలు చేస్తున్నారో ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకుంది. రాజకీయ వత్తిళ్ళు లేకుండా పాలకవర్గం లేకపోవడం, ఎమ్మెల్యే మల్లారెడ్డి పరిపాలనలో జోక్యం చేసుకోకపోవడం, ఎంపీ ఈటల అధికార పార్టీ కాకపోవడం, అధికార పార్టీ నాయకులకు ప్రజల గురించి పట్టించుకునే తీరిక లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో అధికారులు బిల్లుల వసూలుపై పడ్డారు.



నీటి బిల్లుల బకాయి రూ.5 కోట్లు

మేడ్చల్ మున్సిపల్ ప్రజలు నల్లాల ద్వారా నీరు వాడి మున్సిపాలిటీ కి రూ. 5 కోట్లు బకాయిపడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం నల్లా కనెక్షన్‌ల పెండింగ్ బకాయిలు వసూలు చేస్తున్నాం. నల్లా కనెక్షన్ తీసుకున్నప్పటి నుండి నెలకు రూ.100 నిర్ణయించి నెలకు వంద చొప్పున వసూలు చేస్తున్నాం. కేవలం బకాయిల వసూళ్ళ కోసం డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

– నాగిరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్

కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న రాంపల్లి వాసులు




నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో మహంకాళి దేవాలయ కుంభాభిషేక మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గోపూజ, ఆలయప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, చండీహోమం, సాయంత్రం కుంకుమార్చన తదితర పూజలను కన్నుల పండువగా నిర్వహించారు.ఆలయ కమిటీ చైర్మన్ ఎలసాని భూమయ్య, గండి అంజయ్య గౌడ్, వరకాల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. –కీసర

నిషేధిత గుట్కాలు స్వాధీనం


పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు, స్వాధీనం చేసుకున్న గుట్కాలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో నిషేధిత గుట్కాలను ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అడ్మిన్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఎదులాబాద్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించంగా బోడుప్పల్ విజయనగర్ కాలనీకి చెందిన సోహన్లాల్‌గా తేలింది. అనంతరం అతడి దగ్గరున్న బ్యాగులు తనిఖీ చేయగా రూ. 25 వేల విలువ చేసే నిషేధిత గుట్కా ఉత్పత్తులు లభించాయి. బేగంబజార్‌లో కొనుగోలు చేసి ఘట్‌కేసర్ పరిసర పారంతాల్లోని కిరణా, పాన్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు తేలింది.

ఎంచుకున్న రంగాల్లో ముందుకు సాగాలి


కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ విశ్వకరుణ్, నటుడు రవి వర్మ, కళాశాల వైస్ చైర్‌పర్సన్ పుష్పలత

మేడ్చల్ రూరల్: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో ముందుకు సాగాలని డైరెక్టర్ విశ్వకరుణ్, నటుడు రవి వర్మ అన్నారు. కండ్లకోయలోని ధృవ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన స్టూడెంట్స్ ఫెస్ట్ అలరించింది. తెలుగు రాష్ట్రాలలోని వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు డ్యాన్స్, సంగీతం, క్విజ్, ఫోటోగ్రఫీ, వ్యాసరచన, స్పీచ్, రంగోళీ వంటి పలు రకాలు పోటీలు నిర్వహించారు. అతిథులు మాట్లాడుతూ.. యువత విద్యాభ్యాస్యంతో పాటు ఎంచుకున్న రంగాలలో రాణించాలంటే ఇష్టంతో కష్టపడితేనే లక్ష్యం చేరువవుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పోచారం: పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన మేరకు.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన మేడబోయిన నవీన్ (38) వెంకటాద్రి టౌన్‌షిప్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం నుండి నగదు తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత నాగరాజు అనే వ్యక్తి ఫోన్ చేసి వెంకటాపూర్‌లో నవీన్‌ను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్నట్లు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చాడు. సంఘటన స్థలానికి నవీన్ తమ్ముడు లక్ష్మయ్య చేరుకొని చికిత్స కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి నవీన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. లక్ష్మయ్య పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు చేయూత



మేడ్చల్ రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం ఘనాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యువకులు చేయూత అందించారు. గ్రామానికి చెందిన యువకుడు శ్రీనాథ్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు, పెన్నులు, ఎగ్జామ్ పాడ్స్,నోట్ బుక్స్ విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చిలుకానగర్ డివిజన్ బ్యాంకు కాలనీలో ఆక్రమణల తొలగింపు


ఉప్పల్ బ్యాంక్ కాలనీలో రోడ్డు చేపట్టిన నిర్మాణాన్ని తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు

ఉప్పల్: ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి ప్రజల ఇబ్బందులు సృష్టిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు. ఈ మేరకు ఉప్పల్ బ్యాంక్ కాలనీలోని రోడ్డుపై ఉన్న అక్రమ నిర్మాణాన్ని, ఫుట్‌పాత్‌లను జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. అంతకుముందే సదరు వ్యక్తులకు నోటీసులు అందజేసి హెచ్చరించినా ఫలితం లేకపోవడంతోనే కూల్చివేసినట్లు తెలిపారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఉన్న నిర్మాణాలను తొలగిస్తామన్నారు. ఇష్టానుసారంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 15 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో చిన్న డబ్బా పెట్టుకొని పాల ప్యాకెట్లు విక్రయించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని, ఇప్పుడు తన జీవనోపాధి పోయిందని ఓ మహిళ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

అనుమతులు లేకుండా షట్టర్ల నిర్మాణం

- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- ఇప్పటికైనా స్పందించాలంటున్న స్థానికులు


అక్రమంగా నిర్మిస్తున్న షట్టర్లు

బోడుప్పల్: చెంగిచర్ల పాత గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న 11 షట్టర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలో చెట్లను నరికి స్కూల్ ఆవరణలోకి గాలి, వెలుతురు రాకుండా స్కూల్ వాతావరణం పూర్తిగా దెబ్బతినే విధంగా నిర్మిస్తున్నారు. వెయ్యి మంది విద్యార్థులున్న ఈ స్కూల్‌లో విద్యార్థులు బయటకు వెళ్లడానికి, లోపలికి రావడానికి ఒక్కటే గేట్ ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై గతంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్, బోడుప్పల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అక్రమంగా నిర్మిస్తున్న షట్టర్లను నిలిపివేయాలని ఫిర్యాదులో కోరారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి


పనులను పరిశీలిస్తున్న జలమండలి సీజీఎం సుజాత, కార్పొరేటర్ రజితరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులను శుక్రవారం మెట్రో వాటర్ వర్క్స్ సీజీఎం సుజాత, ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. రామంతాపూర్ పరిధిలోని పలు కాలనీల నుంచి ఉప్పల్ చేరుకునే మురుగు కాల్వ, అవుట్‌లెట్ సరిగ్గా లేని కారణంగా ఇక్కడి ప్రజలు నిత్యం నరకయాతన అనుభవించే వారని, ఇప్పుడు సూపర్ సక్కర్‌తో ట్రంక్ లైన్ క్లీనింగ్ ప్రక్రియ చాలా సులభం అయ్యిందని కార్పొరేటర్ అన్నారు. త్వరలో ఈ ప్రాంతవాసులకు మురుగు సమస్య రాకుండా చూస్తామని తెలిపారు. వాటర్ వర్క్స్ జీఎం సంతోష్, డీజీఎం రజినీకాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి


అన్నపూర్ణ కాలనీలో పర్యటిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

మల్లాపూర్: అన్నపూర్ణ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని ఈఈ నాగేందర్ అన్నారు. అన్నపూర్ణ కాలనీలో డ్రైనేజీ సమస్యను శుక్రవారం పరిశీలించారు. అనంతరం డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని కోరారు. సమస్యను పరిష్కరించాలని గతంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి నెమలి అనిల్, శ్రీకాంత్‌రెడ్డి తీసుకువెళ్లారు. వెంటనే పనులు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించడంతో ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి


జెడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ పాటిల్‌కు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. ఓల్డ్ విలేజ్‌లో రోడ్డు పనులు, నాచారం వార్డు కార్యాలయానికి లిఫ్ట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా వీనస్ మేరి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా వీనస్ మేరి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు, జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుల సహకారంతో తనకు అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా నియామక పత్రాలను శుక్రవారం అందజేసినట్లు వీనస్ మేరీ తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.


నియామక పత్రం అందుకుంటున్న వీనస్ మేరీ

చుక్కలు చూపిస్తున్న ట్రాఫిక్

- నేతాజీనగర్ చౌరస్తాలో నిత్యనరకం
- రోడ్ల విస్తరణ లేక సమస్య ఉత్పన్నం
- ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్‌లు
- రోడ్ల ఆక్రమణలతో సమస్య జఠిలం
- ఎవరూ స్పందించక జనం ఇబ్బందులు



కాప్రా: నగర శివారు ప్రాంతంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య నగరవాసులకు చుక్కలు చూపిస్తోంది. శివారు ప్రాంతాలు విస్తరిస్తున్నా అందుకు అనుగుణంగా వసతులు మాత్రం కల్పించలేకపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, ప్రజాప్రతినిధులు మారుతున్నా సమస్య మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన దృష్టి పెట్టకపోవడమే ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమంటున్నారు స్థానికులు.

సిగ్నలింగ్ వ్యవస్థ లేక..

కాప్రా డివిజన్ నేతాజీనగర్ చౌరస్తాలో ప్రస్తుతం ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారిపోయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్యతో సమయానికి స్కూళ్లకు, ఆఫీసుల కు వెళ్లలేకపోతున్నారు. నేతాజీనగర్ చౌరస్తాకు కందిగూడ మార్గం, ఎల్లారెడ్డిగూడ, కాప్రా మార్గం నుంచి హైటెన్షన్ రోడ్డు మార్గాలన్నీ నేతాజీనగర్ చౌరస్తా నుంచి ఏఎస్‌రావునగర్–సైనిక్‌పురి ప్రధాన రహదారికి చేరుకుంటారు. ఈ మూడు మార్గాల నుంచి చౌరస్తాకు చేరుకోవడంతో అక్కడ సిగ్నలింగ్ వ్యవస్థ లేక సమస్య ఉత్పన్నమవుతోంది. ఉదయం సాయంత్రం వేళల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, రాత్రి సమయంలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ ప్రాంతమేకాదు రాధిక చౌరస్తా, కాప్రా చౌరస్తా, నేతాజీనగర్ చౌరస్తా, సైనిక్‌పురి చౌరస్తా, సాకేత్, దమ్మాయిగూడ చౌరస్తా వరకు ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

రోడ్ల విస్తరణ ఎప్పుడో..

కాప్రా డివిజన్ నలుమూల నుంచి వచ్చే ఇతర ప్రాంతాల వాహనదారులు ఈ మార్గాన్నే ఎంచుకుంటున్నారు. అంబేడ్కర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం, ఎల్లారెడ్డిగూడ, వంపుగూడ నుంచి వచ్చే వాహనదారులు కాప్రా, నేతాజీనగర్, రాధిక చౌరస్తా మీదుగా అటు తార్నాక, ఇటు సికింద్రాబాద్ వైపు వెళ్తుంటారు. దీంతో వాహనాల రద్దీ పెరుగుతున్నా అందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. దానికితోడు ఆక్రమణలతో రోడ్లు ఇరుగ్గా మారి ట్రాఫిక్ కష్టాలు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.




కాప్రా చౌరస్తాలో నిలిచిన వాహనాలు